# స్పాట్ వాల్యుయేషన్

ఆ హాల్లో లెక్కల పేపర్ల తాలూకా వాల్యుయేషన్ జరుగుతోంది. చీఫ్ ఎగ్జామినర్స్ నలుగురున్నారు. ఒక్కొక్క చీఫ్ ఎగ్జామినర్‌కి ఎనిమిదిమంది అసిస్టెంటు ఎగ్జామినర్లున్నారు.వాళ్లే అసలు అన్సరు పేపర్లు దిద్ది మార్కులేసేవాళ్ళు . వాళ్ళ దిద్దుడును అక్కడక్కడ మచ్చుకి చూసి సలహా లిచ్చేవాడు చీఫ్ ఎగ్జామినర్. తన కింది అసిస్టెంట్ ఎగ్జామినర్లు దిద్దిన పేపర్లను తను మచ్చు చూసిం తరువాత చీఫ్ ఎగ్జామినర్, మేడ కింద గదిలోకి పంపుతాడు అక్కడుండేది లెక్చరర్లే. వాళ్ళు ఈ దిద్దుళ్ళలో తప్పులు పడతారు. తప్పుకు అయిదు రూపాయల చొప్పున అసిస్టెంటు ఎగ్జామినర్ల ఆదాయంలో కోత చూపెడతారు. వాళ్లని స్క్రూటినైజర్లంటారు.

అన్సరు పేపర్లు దిద్దే హడావిడిలో అసిస్టెంటు ఎగ్జామినర్ల కొచ్చే చిర చిరల్నీ చీకాకుల్నీ ఆ అన్సరు పేపర్లలో కుర్రాళ్ళు రాసిన ఉత్తరాలు కొంతవరకూ పోగొట్టి వాళ్ల మనస్సులకి ఉల్లాసం కలిగిస్తాయి.అంతేకాక, విద్యార్థుల మనఃప్రవృత్తిని అద్దంలోలా చూపిస్తుంటాయి.

పదీ పదీ ఇరవై, ఇరవయ్యిన్నూ తొమ్మిదీ ఇరవయి తొమ్మదీ... అమ్మ కొడుకోయ్ వీడిక్కడ ఆఖరు పేజీలో ఏదో రాశాడండోయ్! చూసుండకపోతే స్క్రూటినైజరుకు దొరికిపోయుండేవాణ్ణి!'' అన్నాడు ఏ.ఐ. ( అసిస్టెంటు ఎగ్జామినరు) వందనం, స్వగతంగా అనుకుంటూనే పక్కనున్న నందనంతో.

నందనం, తను దిద్దుతూన్న పేపర్ని ఆపేసి, కళ్ళజోడులోంచి చూసి తాపీగా - '' రన్నింగ్ మాటరల్లే ఉందే ,ఏదీ చదువు గురూ!'' అన్నాడు.

వందనం చదవటం మొదలెట్టాడు.'' మాస్టారూ, అసలీ మాట్రిక్ లెక్క ఇచ్చినాయన కొచ్చా? రాదు. అందుకనే గదా, టెక్స్ట్‌లో మాదిరి లెక్క కాపీ కొట్టిచ్చాడు.నేనెందుకు టెక్స్ట్ అన్సరు కాపీ కొట్టగూడదు? కానీ కొట్టలేదు. అయితే నా స్టెప్పుల్లో మధ్య మధ్య ఖాళీలొచ్చినయ్. ఏం చెయ్యను. మా మా స్టారు గాంధీ అంత మేధావి కాని గొంగళిపురుగంత ఎర్రోడు. చెప్పటం చాతకాదు అయినా నాముందు కూర్చున్న మాక్లాసు ఫస్టు అమ్మాయి క్కూడా ఖాళీలొచ్చాయి గదా! కనక ఆ అమ్మాయి కేసిన మార్కుల్లో సగం నాకెయ్యటం న్యాయం,''

వందనం , నందనం ఇద్దరూ నవ్వారు. మరి కాసేపటికి ఈ సారి నందనం పిలిచాడు. వందనాన్ని, '' గురూగురూ , నా కొహడు తగిలాడు. చదవనా? ' అన్సరు బుక్కులో గ్రాపు కాగితాలెందుకండీ, ఆ ప్రశ్నలు సిలబస్సులో లేనప్పుడు అయినా పోనీ నా కొచ్చిన ఏ కార్డియాయిడో ( గుండెకాయ) సైక్లాతిడో (సైకిలు వాల్ ట్యూబ్ దొర్లే మార్గం) ఆగ్రాపుమీద గీసి చూపిద్దావంటే నేను ఇంజనీరింగు స్టూడెంటునని మీరు కన్ఫ్యూజన్ అవుతారేమోనని భయం. ఇప్పుడు ఒక గ్రాపు కాగితం ఖరీదు ఎక్స్ పైసలనుకోండి. లెక్కల కుర్రోళ్లు మొత్తం వైమంది అనుకోండి ఈ ఖర్చు ఎక్స్x వై పైసలనుకోండి. అప్పుడు మొత్తం ఖర్చు ఇ అనేది. ఇ = ఎక్స్ x వై+జెడ్ అనే సమీకరణం ద్వారా వ్యక్తమవుద్ది దీన్ని ఇంటిగ్రేట్ చేస్తే ఇంకో స్థిరరాశి వస్తుంది (కాన్‌స్టెంట్ ఆఫ్ ఇంటిగ్రేషన్) దాన్ని కనుక్కోవాలంటే ముందర జడ్, అదే ప్రభుత్వ స్థిర ఖర్చు తెలియాలి అందుకోసం రీసెర్చి చెయ్యాలనుకుంటున్నాను ముందరిది పాసవ్వాలి కదా! ప్లీజ్, పాస్ చెయ్యండి. మాస్టారూ''

ఇద్దరూ నవ్వారు నందనం అన్నాడు " నాలుగు ఇంటెగ్రల్స్‌లో ఏడు ఈ తెలివి చూపించినా ఎట్టాగోట్టా పాస్ మార్కులేసేసి తోసేసేవాణ్ణి ప్చ్ సన్నాసి వెధవ!"

ఇంతలో ఆ వెనకాల్నించి మహిళా లెక్చరర్ స్పందన, ఒక ఆన్సరు పేపరు తీసుకుని హడావిడిగా సి.ఇ. (ఛీఫ్ ఎగ్జామినర్) గంధమాదనం దగ్గర కెళ్లింది ఆమె కళ్ళలోకి ఎర్రజీర లొచ్చున్నాయి. ముక్కుపుటా లెగిరెగిరి పడుతున్నాయి. కోపంగా ఆమె అంది " ఈ స్క్రిప్టు చూడండి సార్, ఈ వెధవ ఏం రాశాడో! వీణ్ణి బుక్ చెయ్యాలండి!" అని ఆ పేపరిచ్చేసి వెనక్కొచ్చేసింది.

గంధమాదనం ఆ పేపరందుకొని చదివాడు " బహుశా నిను బందర్లో చూసి ఉంటా, తెలిసే నిను తొందర్లో తాకి ఉంటా!- క్షమించండి సార్, అదిగో మా కాలేజీ పక్క సినిమా హాల్లోంచొస్తోందీ పాట- రారా పడకింటికీ, నిదుర రాదూ నా కంటికీ . నా మనసు అయిస్సయిపోతోంది. ఒళ్లు జిల్లు మంటోంది లెక్కలెట్లా చెయ్యను చెప్పండి? నాకు ఫస్టు క్లాసు రాదు. ఎప్పుడూ రాలేదు కనక. కానీ మీ సహకారం లేకుండా అవలేను గద. దయచేసి నా సమస్యని అర్థం చేసుకోండి, ప్లీజ్, ప్లీజ్."

గంధమాదనం పిలిచాడు. "మిసెస్ స్పందనా మీ రిట్లా రండి!"

" మిసెస్ స్పందన కాదు. మిస్ స్పందన అని పిలవండి!" అంటూ స్పందన , గంధమాదనం దగ్గర కొచ్చింది.

"చూడండమ్మా వీడిట్లా రాయటం తప్పే. వాణ్ణి మీరు బుక్ చేసి బుద్ధి చెప్పాలనుకోవటం ఒప్పే. కానీ అందుకు మనిద్దరం విరంగా రిపోర్టు రాయాలి. ఏ.సి.వో జనరల్ దగ్గరకెళ్ళాలి. ఆయన్ని కలుపుకుని కాంపు ఆఫీసర్ దగ్గరి కెళ్ళాలి. ఆ తరువాత హైదరాబాదెళ్ళాలి. అవసరమైతే ఈ లోపల మీ దిద్దుడు కొండెక్కుతుంది. నా చెక్కింగు కంచి కెడుతుంది. ఇవి తప్పు చేసిన పిల్లల్ని శిక్షేందుకు సర్కారు వారు కావించిన సువిశాలమైన ఏర్పాట్లు! ఇంత ఓపిక మీకుందా, మీ ఇష్టం! నాకై నాకు ఓపిక లేదు. మహా గజాఃపలాయన్తే మశకానాం తు కా గతిః అందుచేత అమ్మా చూసీ చూడనట్టు కానిచ్యెయ్యండి, మరి సీరియస్సయిందొస్తే ఆలోచిద్దాం - వెళ్ళండి!"

స్పందన, ఆ పేపరుతో చికాగ్గా వెనకొస్తూ - " నేనే ఛీఫ్ నయితేనా, డిబార్ చేయించి పారేద్దును. రాస్కెల్స్!" అనుకొంది, పైకి వినిపించేటట్టు.

నందనం అన్నాడు - " అంతే అంతే, ఆడాళ్ళంతా అంతే మిస్‌గా ఉన్నప్పుడు ఫైర్ అవుతారు. మిసెస్ అయ్యాక సోబర్ అవుతారు. ప్చ్ ఏం చెయ్యలేం!"

ఇద్దరూ నవ్వారు. ఇంతలో స్క్వాటినైజర్ల దగ్గరుండే బాయ్ వచ్చి - " కుందనం గారూ, కుందనంగారూ, మిమ్మల్ని స్క్వాటినైజరుగారు పిలుస్తున్నారు. అన్నాడు.

అదే ఛీఫ్ కిందున్న కుర్ర లెక్చరర్ కుందనం టక్కున లేచాడు. తన పక్కనున్న చందనంతో - " శుభలేఖొచ్చింది, పద బాసూ పోయొద్దాం" అన్నాడు.

చందనం టిక్కమొహం పెట్టేసి కంగారుగా అన్నాడు - " ఇప్పుడా? ఏడిసినట్టుంది! నీతోపాటొస్తే నన్నుకూడా పిలిచాననుకుంటారు, దోపపొడుగునా జనాలు! నువ్వెళ్లులే!"

కుందనం వెళ్లాడు. పావుగంటకి తిరిగొచ్చాడు. వస్తూనే గంధమాదనంతో " ఒహాదేం రాయటేదనుకోండి, దాని కెన్నెయ్యాలి?" అన్నాడు.

గంధమాదనం - " సున్న" అన్నాడు. ..." ఎందుకెయ్యాలి? సున్న కూడా ఒక అంకే గదా!

పూర్ణాంకమే గదా ఏమీ రాయనివాడికి ఒక పూర్ణాంకం మాత్రం ఎందుకెయ్యాలి?"

" స్కూటినైజరు మీచేత సున్న వేయించాడా?" . " ఏదో మరీ మరీ అడుగుతున్నాడని మొహమాటం కొద్దీ వేసొచ్చాలెండి "

" చూడు బాబూ నువ్వు వాల్యుయేషన్‌కి కొత్త అనుకుంటాను. ఏమీ రాయని వాడికి సున్న అనేపూర్ణాంకం ఇవ్వటం గుప్తయుగం నుంచీ హిందూ దేశంలో ఆచారం. కంగారొద్దు. వెళ్ళి దిద్దుకో. "

మిర్రి మిర్రి చూస్తూ వెళ్ళాడు కుందనం.

" చందనంగారూ ఓ మాటిల్లా వస్తారా?" పిలిచాడు గంధమాదనం.

" ఎస్, వస్తున్నానండీ" అంటూ చందనం లేచెళ్ళాడు.

" వీడు రాసిన ట్రాష్‌కి మార్కులిచ్చి మీరు వీణ్ణి పాస్ చేశారు చూడండీ. "

చందనం ఆ పేపరందుకొని చదివాడు- " ఒక గోపురంపై నున్న ధ్వజస్తంభము శీర్షము యొక్క ఊర్ధ్వ కోణములు అల్ఫా, బీటా అయిన ధ్వజస్తంభం ఎత్తెంత అనడిగారు. మంచిది.వన్: ఆ ధ్వజస్తంభము ఒక పక్కకు వాలి యున్నదనుకొనుము. మన ప్రయత్నంలో మనం ఉండగా అది మనమీదకి పడిపోవచ్చును. అందుచేత ఈ కేసులో ఎత్తు కనుక్కొనే ప్రయత్నం మనం విరమించాలి. కేస్ టూ: అక్కడి పూజారికి రెండు రూపాయలిస్తే హాపీగా ఎత్తు చెప్పేస్తాడు. ఎందుకంటే పూజారులు పూర్ పీపుల్స్. కనక కేస్ త్రీ: గుడి తలుపులు వేసుంటేలోపలి కెళ్ళలేం. కేస్ ఫోర్ : అసలు హిందూ దేశంలో ఏ గుళ్ళోనూ గోపురం మీద ధ్వజస్తంభం ఉండదు. కేస్ ఫైవ్: నేను నా వ్యవసాయం పని మానేసి ధ్వజస్తంభం ఎత్తు ఎందుక్కనుక్కుంటూ కూర్చోవాలో ప్రశ్నలో ఇవ్వలేదు.... దేర్ ఫోర్ ఈ కొశ్చన్ అవుటాఫ్ సిలబస్.

" మాస్టారూ! మేడమ్‌గారూ, మూడేళ్ళబట్టీ మాకు లెక్చరరుగారు లేరు. మొన్న సంక్రాంతి ముందర పార్టుటైం మాస్టార్ని వేశారు. ఆయన పండక్కి అత్తారింటికెళ్ళిపోయి ఇల్లరికం అతుక్కుపోయాడు. ఆయన్ని మనమేం చెయ్యలేం, పార్ట్ టైం మనిషి కదా- అన్నారు మా ప్రిన్సిపాల్‌గారు. అందుచేత మా కెవ్వరికీ లెక్కలు రావు. నేను పొలాని కెళ్తాను. కాలేజీ కెళ్ళను.- అన్నప్పుడల్లా మా నాయన నన్ను తంతూంటాడు. దయుంచి నన్ను పాస్ చెయ్యరూ? ఈ తరువాత పొగాకు పండించుకొంటాం."

చదవటం ఆపాడు చందనం. అన్నాడు " ఊఁ దీనికి పదికి మూడేశాను. ఏవంటారు?"... " ఎట్లా వేశారు? అందులో ఏముందని వేశారు?"

" మాస్టారూ, వాడు కిందికి రాడు , పైకెళ్లడు! సరిగ్గా మూడు మార్కుల్లో తప్పి కూర్చుంటున్నాడు. ఏం చావను? అందుకని ఆ మూడూ ఇక్కడేశాను, ఏదో కేస్ వన్ టూ త్రీ లన్నాడు గదాని! పోనీ ఓ పని చేస్తే.. మీరేం అనుకోకపోతే .. ఏదో లెక్కకి నాలుగు స్టెప్పులు, ఏదో మూల బ్లూ ఇంకుతో నేనే వేసేసి, మార్కు లేసేస్తాను. ఏవంటారు?"

బిత్తరపోయి చూశాడు గంధమాదనం "నాలుగు స్టెప్పులు మీ రేస్తారా? నాలుగేళ్ళు సస్పెండు కూడా అవ్వండి! చాల్చాల్లెండి! దయా వద్దూ ధర్మమూ వద్దు, వీడి కెన్నొస్తే అన్నే వేసి చూపించండి!"

చందనం స్క్రిప్టు వెనక్కిచ్చేశాడు. కుందనం అన్నాడు- " మొన్నా అటుమొన్నా ఫ్రీక్వెంటుగా కింది కెళ్ళొచ్చావు గదా బాసూ స్కూటినైజరు దగ్గరకి, ఈ వేళ కదల్లేదేంటి? డ్రింకులూ, గట్రా గాని ఇప్పించావా?"

చందనం సీరియస్‌గా అన్నాడు, " అతనే నా కిప్పించాడు. - గురూగారూ అస్తస్తమానమూ అయిదేసి రూపాయలు మీకు కోత పెట్టలేను నా మీద దయుంచి కుర్రాళ్లమీద మీ దయ కాస్త తగ్గించి

దిద్దండి. ఇహ మిమ్మల్ని పిలవను- అన్నాడు నాకే టీ ఇప్పించాడు. మరాయన మాట తప్పని పెద్దమనిషి. అందుకే పిలుపు రావట్లేదు ''

ఇట్లా అని చందనం కూర్చున్నాడో లేదో, బాయొచ్చాడు చందనాన్ని రమ్మంటున్నారని చెప్పాడు. చందనం విసుక్కుని - '' ఏంటీ, నేను దిద్దిన పేపర్లో మళ్లీ తప్పులా! ఇంపాసిబుల్! అసలు నన్ను పిలవనన్నాడు గదయ్యా మీ అయన! రాను రానని చెప్పు!''

బాయ్ వెల్లిపోయాడు చందనం చటుక్కున లేచెళ్ళి గంధమాదనానికి చిటికెన వేలు చూపించి- '' సార్, అర్జెంటు!'' అన్నాడు

అందరూ ఫక్కున నవ్వారు చందనం కింది కెల్లిపోయాడు మరి కాస్సేపటికి గంధమాదనానికి పిలుపొచ్చింది. అతనెల్లాడు స్క్రూటినైజరు దగ్గరికి. స్క్రూటినైజరుకీ, చందనానికీ వాదన జరుగుతోంది. గంధమాదనం ఆ స్క్రిప్టు తీసుకుని చదివాడు ' వో యేసునాధా, యీ బ్రతుకు ఎందుకయ్యా! ముందు నుయ్యి ఎనక గొయ్యి. ఈ లెక్కల ఊబిలో దింపావేంటయ్యా! సార్ ఇప్పుడే పాపుల స్క్వాడ్ వచ్చింది ఇద్దరిచేత కన్‌ఫెషన్సులు చేయిచ్చింది. వాళ్ళకి టూంబ్సులు కట్టేసింది. ఎల్లిపోయింది. ఆ ఇద్దరికీ మధ్యలో కూర్చున్న వోణ్ణి నేను. నా గుండె బేజారయిపొయ్యింది. ఏం రాయగల్ను చెప్పండ్సార్.. అల్ యువర్ కైండ్‌నెస్ మెర్సీ '

'' దీనికి నాలుగేశాడాయన. ఒప్పుకోమంటారా చీఫ్ గారూ?'' ... '' వద్దు అయన చేతే కోత పెట్టించండి, లేదా మిస్టేక్ బుక్ చెయ్యండి.''

'' సరే, థాంక్స్, వెళ్లిరండి.'' గంధమాదనం వెనక్కొచ్చేశాడు. స్పందన ఒక స్క్రిప్టు తీక్షణంగా చూస్తూ కూర్చునుంది అటువైపుగా వెళ్ళిన నందనం - '' ఏంటండీ'' అన్నాడు. '' ఇది అడపిల్లదా,మగపిల్లాడిదా? చూడండి'' అంది స్పందన స్క్రిప్టు అందిస్తూ. నందనం దాన్ని చదివాడు. ''సారూ నేను చాలా బీదదాన్ని నాకు ఇద్దరు బిడ్డలు నాకు తల్లి లేదు. నా మొగుడు తాగుబోతు. ఇద్దరు అడోళ్లని ఉంచుకున్నాడు ఇప్పటికే చాలాసార్లు మాత్స్ ఒక మాత్స్‌లోనే పోతున్నాను. ఈ సారి సిలబస్ మారిపోతున్నది. మీకు దండం పెడతా... నాకూ, నా పిల్లలకూ అన్యాయము చెయ్యకండి. ఆదరం చూపిచ్చినవారవుతారు. నాకు మళ్లీ ఫీజు కట్టే శక్తి లేదు. మళ్లీ అంతా కొత్త సిలబస్. ఈ మాత్రం కూడా చెయ్యలేను. నాకు సి.ఇ.సి. ఇమ్మంటే ఎమ్.పి.సి ఇచ్చారు. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను. మా పిల్లలకు అన్నం పెట్టుతారు. మీ దయ సారూ . మీ కాళ్లకు మొక్త'' నందనం ఆ స్క్రిప్టుని అందరికీ చూపించాడు. అక్కణ్ణించి తర్జనభర్జనలు మొదలయ్యాయి.

'' అడపిల్ల రాత ఇట్లా విసురు విసురుగా ఉండదు. నాలుగు, తొమ్మిది అంకెల్ని చూడండి.'' అని ఒకరూ,'' అడపిల్ల తెలుగు భాష ఇంత ఘోరంగా ఉండదు కనక ఇది ఆడపిల్ల అయ్యుండదు'' అని ఇంకొకరూ, '' తన మొగుడు ఎంద వెధవైనా , అతగాడు వెధవని ఏ ఆడదీ చెప్పుకోదు. తన మనసుకే తను ఒప్పుకోదు! కనక ఇది అడపిల్ల కాదు '' అని మరొకరూ వ్యాఖ్యానించారు.

నందనం స్పందనతో అన్నాడు - '' ఇది అడపిల్ల రాసింది కాదని మనవాళ్ల సామూహికాభిప్రాయం. ఒక గేప్‌హిట్!'' స్పందన నవ్వింది. కుందనం తాలూకు స్క్రిప్టును అతని దగ్గరికి తీసుకెళ్ళి చూపిస్తూ అతనితో అంటున్నాడు గంధమాదనం । '' ఈ స్టేజికి ఇంకో మూడు మార్కులు పడతాయి మీరు వెయ్యలేదు వెయ్యండి వాడు పాసవుతాడు.''

ఇంతలో ఆ పక్కనే ఉన్న ఇంకో కుర్ర లెక్చరర్ బంధనం, మాటి మాటికీ లేస్తూ కూర్చుంటూ ,

లేస్తూ కూర్చుంటూండటం గంధమాదనం కళ్లలో పడింది అతనన్నాడు " ఏంటండీ బంధనంగారూ సంగతి?"

" ఆం, ఏం లేదండి, బందెల దొడ్డి గేటు తీశారేమో అని" " నాలుగేగా అయింది? అయిదింటిగ్గాని తియ్యరు అయినా అప్పుడే ఇంటిమీద మనస్సు మళ్లితే ఎలా?" నీళ్ళు నములుతూ అన్నాడు బంధనం. " అది కాద్సార్, ఇవ్వాళ మా పాపాయి పుట్టింరోజు. సినిమా కెళ్ళాలనుకున్నాం. మెయిల్ కెళ్ళిపోదామని!"... " అయిదున్నరకి తిరుమల కెళ్ళినా వెళ్లిపోవచ్చుగా!". " అప్పటికి వాళ్ళు నిద్రపోతారు"

" ఏంటీ, పక్కన మీరు లేకుండానే?" అంతా ఫక్కున నవ్వారు స్పందన ఓరగా చూసింది బంధనం వైపు. బంధనం మొహం ఎర్రబడ్డది. గంధమాదనం అన్నాడు. " మీరు వెళ్లకపోతే అక్కడ మీ వాళ్లు అల్లల్లాడతారు కాబోలు. మరిక్కడ పేపర్లు విలవిల్లాడతాయ్, మీరు బాక్ లాగ్‌లో ఉన్నారు ఎలా?"

" అది కాద్సార్, నా కోటా అంతా నేనురేపు పూర్తి చేసుకుంటాను. ఈ పూటకి వెళ్ళక తప్పద్సార్ ప్లీజ్!". గంధమాదనం మెత్తబడ్డాడు అన్నాడు. "సరే, ఓ పని చెయ్యండి గేటు తీసినప్పుడు నేను చెబుతాను, అప్పటిదాకా దిద్దుతూండండి."

అప్పట్నించీ అయిదేసి నిముషాల కొకసారి గంధమాదనం గేటు చూట్టంకోసం నుంచోటం కూర్చోవటం, నుంచోటం కూర్చోవటం మొదలెట్టాడు! చివరికి పావు తక్కువ అయిదింటికి గేటు తీశారు బంధనం అరక్షణంలో తన స్క్రిప్టులన్నీ కట్టగట్టి గంధమాదనానికప్పగించేసి ఒక్క దూకులో కింది కెళ్ళిపోయాడు గేటు దగ్గరకెళ్లాడో లేదో, నిశ్శబ్దంగా మెయిలొచ్చేసింది. వెడుతూన్న మెయిలు కేసీ మేడమీంచి చూస్తున్న గంధమాదనంకేసీ మార్చి మార్చి చూశాడు బంధనం. చటుక్కున వెనక్కి తిరిగి కాంటీన్ వైపెళ్లిపోయాడు! గంధమాదనం చిరాగ్గా లోపల కొచ్చాడు.

వెంటనే అతని దగ్గరికి నందనం వచ్చాడు. అన్నాడు- " మాస్టారూ, ఇంగ్లీషు మీడియం పేపర్లో గుణక సిద్ధాంతం రుజువు చెయ్యమనుంటే దాని తెలుగు వెర్షన్ పేపర్లో సంకలన సిద్ధాంతం రుజువు చెయ్యమనుంది ఏం చెయ్యమంటారు?"

గంధమాదనం చిరాగ్గా చూశాడు. అన్నాడు- " ఆయా స్క్రిప్టుల్ని ఆయా ప్రశ్నలతో దిద్దండి."

"అట్లా అయితే యూనీఫార్మిటీ ఆఫ్ క్వెశ్చనింగ్ పోయినట్టే గదండీ!".. " అవును, పోయినట్టే కాదు పోయింది ఇంకా చాలా పోతున్నాయి ఏం చెయ్యగల్ను?"... " అది కాద్సార్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ వాల్యూయేషన్.." .. " అబ్బబ్బ, మీ ఇష్టం వచ్చినట్టు వేసుకోమని చెబుతున్నాను గదండీ!"

అయిదు నిముషాలైందో లేదో అటెండరొచ్చి అన్నాడు - " సార్ అయిదున్నరకి సుబ్రహ్మణ్యం మైదానంలో ఎడ్యుకేషన్ మినిస్టరుగారి మీటింగున్నాదంట. అందుకని వెంటనే వర్కు, ఆపేసి బండిల్సుని తెచ్చెయ్యమంటున్నారు. స్ట్రాంగు రూము తాళం యేసేస్తారంట రేప్పొద్దున గంట ముందొచ్చి దిద్దుకోమంటున్నారు. మిమ్మల్నొచ్చి ఈ రోజు కోటా చెప్పమంటున్నారు."

గంధమాదనం కోపంగా అన్నాడు- " కూసే గాడిదొచ్చి మేసే గాడిదను చెడగొట్టిందట. అసలే మాకు కోటాలవ్వక చస్తూంటే ఈ గోలొహటా? ఆయనగారి రాజకీయ మీటింగుకి ఇక్కడ పేపర్లాపెయ్యటం ఎట్లా ఉపయోగిస్తుందిట? సరే, వీళ్లు రేప్పొద్దున గంట ముందెట్లా వస్తారు పిండాకూడు తిని రావాలా అక్కర్లేదా? కోడికూతకే వచ్చి కూర్చోమంటావా?"

" అవ్వన్నీ నాకు తెలవద్సార్ అరు చెప్పమన్నది చెప్పాను " అటెండరెళ్ళిపోయాడు. మూడు నిముషాల్లో గంధమాదనం అందరిచేతా స్క్రిప్టులు కట్టలు కట్టించేశాడు బాయ్ చేత కిందికి పట్టించుకెడుతూండగా ఇంకో లెక్చరరు స్యందనం, గంధమాదనం పక్కనే నడుస్తూ అన్నాడు. - " మాస్టారూ , ఒక డౌటు, ప్రతి ఏడాదీ చూస్తున్నాను. ఈ కుర్రాళ్ళిలా పేపర్లలో ఉత్తరాలెందుకు రాస్తున్నారంటారు?" గంధమాదనం అన్నాడు - " ఎందుకంటే ఏం చెప్పను? చదువుమీద మనసు పోక అసలు చదువెందుకో తెలీక, చదివి ఏం చెయ్యాలో అర్థంకాక.

" టెన్త్ క్లాసువరకూ అందరికీ చదువుండాలనుకొంటున్నాం బాగానే ఉంది. ఆ తరువాతేం చేస్తున్నాం? హాయిగా వ్యవసాయమో, వృత్తో చేసుకోనేవాణ్ణి అల్లించి బెల్లించి హయ్యర్ ఎడ్యుకేషన్ గుండంలోకి ఈడ్చేస్తున్నాం. సి ఇ.సి. కావాలి మొర్రో అన్నవాణ్ణి బెదరగొట్టి ఎమ్ పి.సి. లోకి తోస్తున్నాం. వాళ్లు మొయ్యలేని సిలబస్‌ను చావగొట్టి మోయిస్తున్నాం సినిమా హాళ్లు సారాకొట్లు మధ్య కాలేజీలు పెట్టి తప్పు నాయనా మనస్సు అదుపు చేసుకో అంటున్నాం. పరీక్షలో కాపీ కొట్టాలనే కోరిక పిల్లల కసలు కలక్కుండా చెయ్యటం పోయి, దొరికితే డొక్కచించే మార్గాల్ని కొల్లలుగా కనిపెడుతున్నాం. ఇందుకోసం అంతర్ స్క్వాడ్, బాహ్య స్క్వాడ్, జిల్లా స్క్వాడ్, జోనల్ స్క్వాడ్, స్పెషల్ స్క్వాడ్ - ఇట్టా కసికసిగా వాళ్ళు దొంగలు మనం పోలీసులం అన్నట్లు స్క్వాడ్‌లు వేసుకుంటూ పోతున్నాం.

" ఇన్ని బిగింపులూ వాళ్ళకోసం చేశాక మనకోసం మనం చేసుకొంటున్నది మాత్రం ఏమిటి? ఏ వయస్సు వాళ్లకి ఏ సైకాలజీతో పాఠం చెప్పాలో తెలీని వాళ్ళు మన లెక్చరర్ సోదరులు. ఎన్నడూ ఆ క్లాసుకు పాఠం చెప్పని వయోవృద్ధుడిచేత ప్రశ్నా పత్రం మిప్పించి గుప్పించగలిగినన్ని అవకతవకలు దాంట్లో గుప్పిస్తున్నాం 'మీ కోటా మీరు దిద్ది పొండయ్యా' అంటే ఎట్లాగోట్లా మార్కులేసేసి, మెయిల్ ఎప్పుడెక్కుదామా అని చూసేవాళ్లే ఎక్కువమంది మనలో!

" వీటన్నింటికన్నా దారుణం ఏలిన వారి నిర్లక్ష్యం! ఇటీవల, పర్మెనెంటు పోస్టుల్లో ఇవాళుండి రేపెళ్లిపోమే పార్టుటైము లెక్చరర్లని కొల్లలుగా వేశారు. మహారాజశ్రీ దొరతనం వారా! ఇంతకన్నా ఘోరం భూమ్మీదెక్కడైనా ఉందా?

" అసలు చదువెందుకో, చదివి ఏం చెయ్యాలో తెలీని ఆ పసిగుండెల్లో ఎన్నెన్ని అలజళ్ళు సుళ్లు తిరుగుతున్నాయో, ఎన్నెన్ని ఆవేదనలు కళ్ళెపెళ్ళాడుతున్నాయో , ఆలోచించేవాడెవడు? పట్టించుకొనే వాడెవడు? వ్యవస్థండీ వ్యవస్థ! ఈ అయోమయం విద్యా వ్యవస్థ - మెకాలే దొరగారి మానసపుత్రిక - సమూలంగా మారితేనే గాని ఏం చెయ్యలేం. జాతి జీవన ప్రవాహంతో ముడిపడిపోయే సహజమైన విద్యా విధానాన్ని మనం ఏర్పరుచుకొనేటంతవరకూ మన హిందూ దేశం పరిస్థితింతే! స్పాట్ వాల్యుయేషన్లో మనం అన్సర్లు కాక ఉత్తరాలే చదువుతుంటాం!"

(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక 01-02-89)

★★★ ★★★ ★★★